
# హిమాలయ గురుపరంపర



మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ



మైత్రేయ మహర్షి



దేవాపి మహర్షి



మరువు మహర్షి

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# హిమాలయ
# గురుపరంపర

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

1వ ముద్రణ 2005 : 1,000 ప్రతులు
3వ ముద్రణ 2015 : 1,000 ప్రతులు

వెల : రూ ॥ **30-00**

ప్రాప్తిస్థానము :

**ధనిష్ఠా ఫౌండేషన్**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531
www.dhanishta.org & info.dhanishta.org

ISBN : 978-81-89467-42-5

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్,**
మధురానగర్, విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891-2735878, 9849996538

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

## విషయసూచిక


| | |
|---|---|
| పరమగురువుల పరంపర | 7 |
| మైత్రేయ మహర్షి | 13 |
| మరువు, దేవాపి మహర్షులు | 23 |

# పరమగురువుల పరంపర

పరమగురువుల పరంపర ముక్తజీవుల సంఘము. వారు భూమిజీవుల శ్రేయస్సు కొరకు, మరియు భూమి శ్రేయస్సు కొరకు పనిచేయుచుందురు. జీవులకు విశ్వచైతన్యమును గుర్తుచేయుట, మరియు ప్రతిజీవియు, చైతన్యముయొక్క రూపమే నని తెలియజేయుట ప్రధాన అంశముగా వారు నిర్వర్తింతురు. వారి అనుయాయులు భూమి నాలుగుచెఅగుల, హిమాలయ ములు కేంద్రముగా పనిచేయుచుందురు. మానవజాతి శ్రేయస్సుకై పనిచేయు మానవతావాదుల ఆలోచనా శక్తి నుండి కూడా వ్యక్తమగుట వారు చేయు ముఖ్యమైన కార్యక్రమము. జీవుల శ్రేయస్సుకై వివిధములుగ కృషి చేయుచున్న వారందరూ మానవతావాదులే. అట్టివారికి స్ఫూర్తినిచ్చుట రహస్యముగ నిర్వర్తించుచుందురు. సామాన్యజీవులను గురుపరంపర సంప్ర దాయమున, మొదట వివేకవంతులను చేసి, వారియందలి ఆలోచనాశక్తిని పెంచి, భ్రష్టుపట్టిన సంప్రదాయముల నుండి, మూఢవిశ్వాసముల నుండి, ఆలోచనాసరళినుండి ఉద్ధరించుట, వారి అనుయాయుల ద్వారా వారు నిర్వర్తించుచుందురు. బడుగు

వర్గములకు, అట్టడుగు వర్గములకు అక్షరాస్యత నిచ్చుట, ప్రాపంచిక విద్యలయందు వారిని నిర్దేశించుట మొదలగు కార్యములు నిర్వర్తించుచుందురు.

ఇట్లు నాలుగు విధములుగ మానవ జాతి పురోగమనమునకు గురుపరంపర వేలసంవత్సరముల నుండి కృషి సల్పుచున్నది. వివేకవంతులను, ఆలోచనాశక్తి గలవారిని చైతన్యవంతులను జేయుట, ఆత్మవిద్య నుపదేశించుట, తద్వారా జాతి శ్రేయస్సు కొరకు పనిచేయు పరంపర యందు సభ్యునిగా నియమించు కొనుట ఒక భాగము. సామాన్య జీవులను మూఢనమ్మకముల నుండి, ఛాందస సంప్రదాయములనుండి ఉద్ధరించి వివేకవంతులను చేయుట రెండవ భాగము. బడుగు వర్గముల వారికి అక్షరాస్యత, విద్యాభ్యాసము, వృత్తివిద్యా నేర్పరితనము మొదలగు విషయములలో ప్రాపంచిక నిపుణత ఏర్పరుచుట మూడవ భాగము. సమస్త జీవరాశుల కొరకై అనుయాయులద్వారా కృషి చేయుట నాలుగవ భాగము.

పరమగురువుల పరంపరకు 'గోబి' ఎడారియందు నిహితమై యున్న 'శంబళ' గ్రామము మొదటి కేంద్రము. భూమికి ప్రభువైన సనత్కుమారప్రజ్ఞ శంబళ గ్రామమందు దృశ్యాదృశ్యముగ నున్న దని పురాణములు ఘోషించుచున్నవి. హిమాలయము లందలి కైలాసపర్వతమునకు ఉత్తరముఖముగానున్న గుహలలో పరమ గురువుల ప్రధాన ఆశ్రమము కలదని తెలిసినవారు చెప్పు చుందురు. ఈ ఆశ్రమము ప్రధాన కేంద్రముగా గురుపరంపర

భూమియందలి వివిధ ప్రదేశములలో మరి 7 కేంద్రముల నేర్పరచుకొని పనిచేయుచున్నది. 'శంబళ'తో మొత్తము 8 (ఎనిమిది) కేంద్రములు. శంబళ అనగా 'శ్యామ-బాల'. భూమి జలమయమై యున్నప్పుడు భూమికి ప్రభువైన సనత్కుమార ప్రజ్ఞ 'శ్యామబాలునిగ' మార్కండేయునకు దర్శన మొసగెనట. అందువలన, అది శ్యామ-బాల ప్రదేశముగను, కాలక్రమమున 'శంబళ'గను అవస్థితి చెందినది. ఏడులోకముల కతీతమైన ఎనిమిదవ ప్రజ్ఞగా నీలివర్ణముతో పసిబాలుడు నీలాకాశమున తేలియున్నట్లుగను, మఱ్ఱియాకుపై తేలియుండు శ్రీకృష్ణుడిగను వర్ణింపబడిన ప్రజ్ఞ యిదియే. ఈ ప్రజ్ఞ భూమికి ఆజ్ఞాచక్రము వంటిది. మానవులు కూడ 'ఆజ్ఞ' యందు శ్యామబాలుని దర్శనము చేసుకొనవచ్చును. గోప్యముగ నున్నది గనుక 'గోపి' ఎడారిలో నున్నదని చెప్పుదురు. కాలక్రమమున 'గోపి' యను నామము 'గోబి'గా మారినది.

గురుపరంపరకు సంబంధించిన కేంద్రము హిమాలయ ములలోని కైలాసపర్వత సమీపమునగల గుహలలో యున్నది. ఈ కేంద్రము భూమికి హృదయము వంటిది. మన హృదయము నందుకూడ ఈ ఆశ్రమమును, గురుపరంపరను దర్శించ వచ్చును. జగద్గురువగు మైత్రేయుడు, మరువు మహర్షి, దేవాపి మహర్షి, జ్వాలాకూలుడు యిచ్చట నుండియే భూగోళమంతయూ వ్యాపించి పనిచేయుచున్నారు.

ఈ ఆశ్రమమునకు సంబంధించిన శాఖలు ఆరు (6) ప్రధాన శాఖలుగ, మొత్తము 7 ఆశ్రమములుగా భూమి యంతట

కాలక్రమమున హిమాలయములు కేంద్రముగా ఏర్పడినవి. ఇవి సూర్యుని సప్తకిరణములుగా ఆకర్షణప్రభావముతో తరంగములుగా భూమిజీవులకు స్ఫూర్తి నిచ్చుచుండును. ఈ 7 కేంద్రములకు 7 ఉపకేంద్రములుగ మొత్తము ( 7×7 ) 49 కేంద్రములుగ భూమి అంతయూ ఈ మహత్తర గురుపరంపర అల్లుకొనియున్నది.

గురుపరంపరలోని మహాత్ములందరూ మానవులే. జన్మల తరబడి, సత్సాధనల నొనరించి దైవమునకు, మానవులకు మధ్య సంధానకర్తలుగ స్థితిచెందినారు. దివ్యశరీరములను వారు యోగసాధనద్వారా నిర్మాణము చేసుకొని, దివ్య సంకల్పమునకు వాహికలుగ నిలచినారు. తరతరములనుండి మానవజాతికి దివ్య స్పర్శ కలియుగారంభము నుండి అందించుచున్నారు. శ్రీకృష్ణుని నిర్యాణ సమయమున ఆయన సంకల్పముగ మైత్రేయ మహర్షిని ఈ గురుపరంపరకు ప్రధానవాహికగ నియమించుట జరిగినది. అప్పటినుండి మైత్రేయమహర్షి జగద్గురువుగ విరాజిల్లుచున్నారు. వారి అనుయాయులు మరుపు, దేవాపి, జ్వాలాకూలుడు ఐదు వేల సంవత్సరముల నుండి జగద్ధితమగు కార్యములను నిర్వర్తించుచున్నారు.

గురుపరంపర యందుగల సభ్యులందరూ మొదట సాధారణ మానవులే! జీవితమున కష్టసుఖముల ననుభవించిన వారే. తప్పు ఒప్పులు చేసినవారే. అపజయములు, అనారోగ్యములు అనుభవించిన వారే. నిందాస్తుతులను భరించిన వారే. సత్సాధనా

మార్గమున వ్యక్తిగత కర్మను దగ్ధము చేసుకొనుచు, దివ్యకర్మను పెంపొందింపజేసుకొనుచు వెలుగు లోకమును నిర్మించుకొని, అమృతత్వమును సాధించి మానవశరీరములందు స్వచ్ఛందముగ జీవించుచూ, లోకహితములైన కార్యముల నొనరించుచున్నారు. వందల, వేల సంవత్సరముల నుండి ఈ పరంపరలోని సభ్యులు మానవజాతిని తమ కనిష్ఠ సోదరులుగ భావన చేసి మానవజాతి ఉన్నతి కొరకు పాటుపడుచున్నారు. మానవునియొక్క సాధక బాధకములు, త్రివిధములగు ప్రవృత్తులు పూర్తిగ నెరిగినవారు. పరిపూర్ణమైన అవగాహనతో, ప్రేమతో జాతి నుద్ధరించుటకు, జీవులను ధర్మమార్గమున నడిపించుటకు దివ్యసంకల్పమునకు వాహికలై నిలచినారు.

ప్రపంచమున జరుగబోవు అనేక దుర్ఘటనలను తమ దివ్య శక్తిచే నివారించి భూమిజీవుల నందరను కాపాడుచున్నారు. జరిగిన దుర్ఘటనలే మానవులకు తెలియునుగానీ నివారింపబడిన దుర్ఘటనలు తెలియవు గదా! తెలియజెప్పవలెనను ఆరాటము కూడ వీరికిలేదు. గుర్తింపు అను మానవ స్వభావము నధిగమించి కర్తవ్యమును మాత్రమే దైవపరముగ నిర్వర్తించుచూ, అనేక భౌగోళికసన్నివేశములలో తమ సంకల్పస్ఫూర్తిని మానవ మేధస్సున కందించి, మానవజాతి కష్టములను నివారించుటకు, పురోగతిని ప్రోత్సహించుటకు కంకణము కట్టుకొనినారు.

కుల, మత, దేశీయ, ప్రాంతీయ తత్త్వముల నధిగమించిన సత్యమును దర్శనము చేయుట, అట్టి దర్శనమునకు నిర్దిష్టమైన

మార్గము నొసంగుట వీరి ప్రధానమైన కార్యక్రమములలో ఒకటి. లోకహితమగు కార్యములు నిర్వర్తించుట, స్వాధ్యాయము చేయుట, ధ్యాన మార్గమున క్రమముగా తనను తాను పొందుట వీరొసగిన త్రికోణాత్మక మార్గము.

పతంజలి యోగసూత్రములు, శ్రీమద్భగవద్గీత, ఉపనిషత్తులు, శ్రీమద్భాగవతము ప్రధాన గ్రంథములుగ, భౌగోళికముగ ఆర్ష విద్యను అందించుచున్నారు. సమస్తదేశముల వారికి, అన్ని ప్రాంతముల వారికి తత్త్వబోధ నందించుచూ, మతాతీతమైన 'సత్యము' నందు నిలుపుటకు, ధర్మము నాచరింప చేయుటకు ఎనలేని కృషి సల్పుచున్నారు. ఇటీవలి శతాబ్దములో ఎందరో లోకహితులు శరీరధారులై దిగవచ్చి దివ్యప్రణాళికను నిర్వర్తించుచున్నారు. అందరిదీ ఒకటే మార్గము. అది "నా" మార్గము. వివిధములుగా గోచరించినప్పటికీ జీవులందరూ "నా" మార్గము ననే తరించుట జరుగుచున్నది. ఆ మార్గమును మరల మరల మనకందించుటకు దిగివచ్చు వారందరూ గురుపరంపర సభ్యులే. అందు నడచు వారందరూ సాధకులే. ఇట్టి లోకహితులలో మనమెరిగిన శ్రీ షిరిడీ సాయిబాబా, శ్రీ సత్యసాయిబాబా, శ్రీ రమణమహర్షి, శ్రీ అరవింద మహర్షి, శ్రీ లహరి మహాశయులు (వారి అనుయాయులు), మాస్టర్ సి.వి.వి., మాస్టర్ ఎమ్.ఎన్; మాస్టర్ ఇ.కె; మేడమ్ బ్లావెట్స్కీ, ఏలిస్ ఎ. బెయిలీ మొదలగు వారెందరో గలరు. అందరికీ గురుపరంపర మార్గమున నమస్కరించుచూ, ముందుకు నడచుట మన కర్తవ్యము.

# మైత్రేయ మహర్షి

మైత్రేయ మహర్షి భూమిపై నిలచిన యోగేశ్వరుడు. అతడు సాక్షాత్తు శ్రీకృష్ణుడే. అతని యందు శ్రీకృష్ణుడు శాశ్వత నివాస మేర్పరచుకొనెను. భగవంతుడగు శ్రీకృష్ణుడందించిన దివ్యప్రణాళి కను భూమిపై నిర్వర్తింప చేయుచున్న జగద్గురువతడు. క్రైస్తవులచే క్రైస్తుగను, బౌద్ధులచే మైత్రేయ బుద్ధుడుగను, ఇస్లాము మతస్థులచే ఇమామ్ మెహదిగను ఆరాధింపబడుచున్న సిద్ధపురుషుడు.

మైత్రేయ మహర్షి దివ్య శరీరధారి. నిర్మలమైనమూర్తి. దర్శన మాత్రముచే ఎవ్వనికైనను సకల మోహముల నుండి విముక్తి కలి గించు మోహనమూర్తి. సంసారమందలి జీవులు తరించి జీవన్ము క్తులై జీవించుటకు పరమపద ముఖద్వారమున నిలచియున్న బోధిసత్త్వుడు. పరమపద ముఖద్వారమున నిలచియున్న బోధి సత్త్వుడు. పరమపదము నుండి దివ్యప్రజ్ఞలు భూమిపై అవత రించుటకు, భూమి జీవులు పరమపదము చేరుటకు మార్గముగ నిలచిన పుణ్యమూర్తి. సాటియోగులను పూర్ణానందస్థితి యందు నిలపి భూమిపై జీవులకు యోగమార్గమునుపదేశించుట కుద్య మింపజేసిన పూర్ణానంద స్వరూపుడతడు.

సిద్ధి, బుద్ధి, జ్ఞానము, ఆయనకు కరతలామలకములు. జ్ఞానము బోధింపజేసి, యోగమభ్యసింపచేసి, సిద్ధి బుద్ధులను ప్రసాదింపజేయు యోగేశ్వరుడతడు. భక్తి జ్ఞాన వైరాగ్యములను యోగముద్వారా పటిష్టము గావింపజేసి, నిష్కామ కర్మమార్గమున వేలాది జీవులను నియమించిన కర్మనిష్ఠుడతడు. అతడు నిరంతరము పద్మాసనమున నాసీనుడై యమము, నియమము మొదలగు ఎనిమిది అంగములతో కూడిన యోగము నభ్యసించుచుండును. మనస్సు ఎప్పుడూ శ్రీకృష్ణుని పాదపద్మములయందు లీనమై యుండును. అతనికి ఇంద్రియార్థముల యందు కూడ శ్రీకృష్ణుడే గోచరించును. పుణ్య వ్రతాచారములలో నియుక్తమైన అతని శరీరము పలుచనిదై కాంతి కిరణములను ప్రసరింపచేయుచు నుండును.

అతడు ఆజానుబాహువు, తపస్వి, కరగిన బంగారము వంటి మేనిఛాయ కలవాడు. వెడద కన్నుల నడుమ విశాలమైన భ్రూ మధ్యముపై రెండు ఊర్ధ్వ రేఖలు కలిసి వెలుగుతో కూడిన తమ్మి మొగ్గవలె ప్రకాశించుచు గోచరించును. ఆ భ్రూమధ్యము నుండి ప్రసరించు వెలుగు, చీకట్లను తిరస్కరించు నేతి దీపమువలె వెలుగుచుండును.

మైత్రేయ మహర్షి భూమిపై అవిరామముగ కృషి చేయుచున్న సద్గురు పరంపరలన్నింటికిని అధిపతి. గురువులకు గురువు, దైవము. అతడు పురాణపురుషుడగు శ్రీకృష్ణునిచే కలియుగాంతము వరకు జగద్గురువుగ నియమింపబడిన సిద్ధపురుషుడు.

ధర్మమతని స్వరూపమున నిలచి భూమిపై వ్యాప్తి చెందుచు నుండును. సమస్త జీవులకు కరుణ, ప్రేమ, నిత్యము ఉభయ సంధ్యలయందు తన హస్తములనుండి ప్రసరింపచేయుచు నుండును. మైత్రేయుని స్మరణమే సర్వపాపహరణము. ఆ పుణ్యాత్ముని చూచిన వారికి వయస్సు యొక్క చిహ్నాములు గోచ రింపవు. అతడు సంచరించిన ప్రదేశములు పుణ్యతీర్థములై వెలసి యున్నవి. లోకమును పవిత్రము చేయుట కొరకు మాత్రమే అతడు విహరించుచుండును. తన్నాశ్రయించిన వారికతడు విధేయుడు.

అట్టి మైత్రేయ మహర్షి కాశీరాజైన దివోదాసుని కుమారుడు. కాశీరాజు చంద్రవంశపు రాజు. కాశీరాజుల మూలపురుషుడు ధన్వంతరి. అతడు ద్వాపర యుగమున చతుర్థ పాదమున కాశీ పట్టణమున పట్టాభిషక్తుడై ప్రజాహితముగ పరిపాలనము కావించెను. ఈ ధన్వంతరి మహావిష్ణువు అవతారమైన ధన్వంతరి కాడు. మహావిష్ణువగు ధన్వంతరి అమృత మధన కాలమున అమృత కలశముతో ఉద్భవించి, జీవులకా కలశమును హృదయముగా సృష్టి చేసి ఇచ్చెను. దానితో అనంతమైన కాలమును తమ ఆయుర్దా యముగ దర్శించి జీవులు దేహమునల్లుకొనుట నేర్చిరి. హృదయము కారణముగ, ప్రణవము ఉచ్ఛ్వాస నిశ్వాసాత్మకమై, దేహము నందు ప్రతిష్ఠ జరుగుట జరిగినది. అట్టి ధన్వంతరి ప్రజ్ఞను కాశీరాజగు ధన్వంతరి, తన సహాధ్యాయి అయిన భరద్వాజ మహర్షితో కూడి ఆయుర్వేద శాస్త్రముగ తీర్చి దిద్దినాడు. భరద్వాజ

మహర్షి, ధన్వంతరి, వీరిరువురి వలన ఆయుర్వేద శాస్త్రము లోకమున ప్రసిద్ధి చెందినది.

తరువాతి తరములో ధన్వంతరి కుమారుడు కేతుమంతుడు ఆయుర్వేదమున సిద్ధుడై నాలుగు వందల సంవత్సరములు కాశీ రాజ్యమును పరిపాలించెను. ఇతని కాలమున కాశీరాజ్యమున, కాశీనగరమందు విశ్వ విద్యాకేంద్ర మొకటి ఏర్పడినది. తన తండ్రియైన ధన్వంతరి ఆరువేల మంది సుశ్రుతులను తయారుచేసి దేశమున వెదజల్లగ, కేతుమంతుడు చరక సంహితము తయారు చేయించి సంచరించుచు వైద్యముచేయు వర్గము నేర్పరచెను. చరకులను నామమున వీరందరును ప్రసిద్ధి గాంచిరి. సుశ్రుతులు, చరకులు రాజ్యమున ప్రజలకు జీవన విధానము, ఆరోగ్యము సంతర్పణ గావించుచుండిరి.

కేతుమంతుని కుమారుడు భీమరథుడు. ఇతడి కాలముననే చ్యవనప్రాశము ఆవిర్భవించినది. భీమరథుని కుమారుడు దివో దాసుడు. ఇతడి కాలమున వసంత కుసుమాకరము ఆవిర్భవించి నది. దివోదాసుడు ద్వాపరయుగమింకను నాలుగు వందల సంవత్సరము లుందనగ, కాశీరాజ్యమును పరిపాలించెను. అతడు కురుచక్రవర్తియైన శంతనునికి సమకాలికుడు.

దివోదాసుని కుమారుడు మైత్రేయుడు. అతడు మైత్రేయుని వేదవేదాంగ పారంగతునిగ ఆయుర్వేదనిధిగ, లలిత కళల యందు కుశలునిగ నొనరించెను. తండ్రి వద్ద విద్యాభ్యాసము పూర్తియైన వెనుక హిమవత్ పర్వతారణ్య సీమలలో నున్న పరాశర మహర్షి

శిష్యుడై, మైత్రేయుడు చిరకాలము సద్గురు శుశ్రూష గావించెను. గురుసాన్నిధ్యమున అష్టాంగయోగమున సిద్ధుడై దేహమునకును, తనకును గల బంధమును, శాశ్వతముగ త్రెంచుకొని దివ్య దేహ ములయందు సంచరించుట అభ్యసించెను. పరిప్రశ్న మార్గమున పరాశరునిచే విష్ణు పురాణము వివరింపబడుటకు అతడు కారకు డయ్యెను. మైత్రేయ పరాశర సంవాదమే విష్ణుమహా పురాణము. దీనినే తరువాతి కాలమున పరాశరుని కుమారుడగు వేదవ్యాసుడు పదునెనిమిది పురాణములుగ విశదీకరించెను. ఆ తరువాతి కాలమున కలియుగమున విదుర మైత్రేయ సంవాదముగ భాగవత పురాణమేర్పడినది.

పరాశర మహర్షి త్రికాలజ్ఞాని. అతడు పురాణ పురుషుని అవతరణమును తన దివ్యచక్షువుతో దర్శించెను. రాబోవు పూర్ణావ తారమునకు భూమిపై తోడ్పాటు గావించిన యోగేశ్వరులలో పరాశరుడు అగ్రగణ్యుడు. దివి నుండి నారదుడు, భువి నుండి పరాశరుడు పురాణ పురుషుని అవతరణమునకు తగు ఉపాధిని భూమిపై పరోక్షమున గావించినారు. పరాశరుడు పురాణ పురుషుని కుపయుక్తముగ పనిచేయుటకై ఉత్తమజీవులను కొందరిని చేరదీసి వారిని వేదవేదాంగముల యందు, అష్టాంగ యోగము నందు పరిపూర్ణులను గావించినాడు.తన కుమారుడగు వేదవ్యాసునితో సహా ఈ సుశిక్షితులగు శిష్యులనందరిని పురాణ పురుషుని సంకల్పమునకు సమర్పితము గావించినాడు. అట్టి వారిలో ముఖ్యుడు మైత్రేయుడు. ఇతర ముఖ్యులు, సూర్యవంశపు వాడగు మరువు, చంద్రవంశపువాడగు దేవాపి, (ఇతడు శంతనుని

జ్యేష్ఠ భ్రాత) యదువంశపువాడగు అక్రూరుడు, సాందీపని, బృహస్పతి ఇత్యాదులు.

గురుస్పర్శ కారణముగ మైత్రేయుడు తండ్రి అనుమతితో రాజ్యపాలనా కర్తవ్యమును త్యజించి భరతభూమి భవిష్యత్తునకై తన సర్వస్వమును ధారపోసెను. హిమాలయములందలి కలాప గుహలను తన నివాస స్థానముగ నేర్పరచుకొని దైవకార్యమును చిరకాలము సాధించుటకు స్థిర సంకల్పుడైనాడు. హిమవత్ పర్వత గర్భమున లీనమై పోయిన శంబళ గ్రామమును మరువు, దేవాపి మహర్షుల సహాయమున, పునరుత్థానము గావించెను. కలియు గాంతము శ్రీకృష్ణునికి వాహికయై దివ్యప్రణాళికా నిర్వాహణమున శాశ్వతముగ బాధ్యత పడెను.

మైత్రేయుని పరిప్రశ్నమున విష్ణుపురాణము పరాశరు డందించినట్లుగ తెలుపబడినది. విష్ణు మహాపురాణము సకల వేద సమన్వయము. అది ఉపదేశపూర్వకముగ మైత్రేయుడు పరాశరమహర్షి నుండి పొందినాడు. ఈ పురాణ మందలి ఉప విద్యలే రాజనీతి, దండనీతి, మోక్ష ధర్మము, జ్యోతిర్విద్య, ఖగోళ విద్య, యుగాంతర పరిగణనము మొదలగునవి. విష్ణుపురాణ అధ్య యనము మైత్రేయునికి యాభై సంవత్సరములు సాగినది. మొదటి పది సంవత్సరముల ఉపదేశము కలాప గుహల ముఖద్వారమున గల రావిచెట్టు క్రింద జరిగినది. తరువాత పది సంవత్సరములు బదరికాశ్రమమున జరిగినది. తరువాతి ముప్పది సంవత్సరములు ప్రయాగలో కృష్ణ ద్వీపమున జరిగినది. యాబది సంవత్సరములు ఒక పురాణమును, అభ్యసింపచేయుట పరాశరునికే తగినది.

అభ్యసించుట మైత్రేయమహర్షికే చెందినది. ఈ గురు శిష్యులు వారికి వారే సాటి.

మైత్రేయ మహర్షికి దేహసంబంధముగ ముగ్గురు సోదరీ మణులు. వీరు మహాభారతమున ప్రసిద్ధి గాంచిన అంబ, అంబిక, అంబాలిక, భీష్మపితామహుడు మైత్రేయునికి సమకాలికులు. ధృతరాష్ట్రుడు, పాండురాజు తనకి మేనల్లుళ్ళు. సర్వసంగ పరిత్యాగము మొనర్చినప్పటికి తన కర్తవ్యము మేరకు ఒకటి రెండు మార్లు ధృతరాష్ట్రుని ధర్మపరముగ హెచ్చరించినాడు. అతడు మమకారము వీడనిచో కులక్షయ మగునని, నిండు సభలో దర్శన మిచ్చికూడ హెచ్చరించినాడు.

శ్రీకృష్ణజనన సమయమున అప్రాకృత శరీర నిర్మాణమునకై పరాశరు డొనర్చిన మహాయజ్ఞమును మైత్రేయుడు ముఖ్యమగు పాత్రను పోషించెను.

నారదమహర్షి, హిమవత్ శైలపుత్రి ఆదేశమున పరాశరుడు సప్తాహయజ్ఞ మొకటి నిర్వర్తించినాడు. ఆ యజ్ఞమున ప్రధాన పాత్రధారుడు మైత్రేయుడు, వేదవ్యాసుడు, మరువు, దేవాపి, సనత్కుమారుడు, సనత్సుజాతుడు. ధూళిధూసరములైన పంచ భూతములను వేదఘోషలచే సంస్కరింపజేసి, పురాణపురుషుని దివ్య దేహమునకు ఉపాధులుగ నేర్పరిచిన మహాయజ్ఞమది. దేవకీదేవి గర్భమున ఇదివరకే నేర్పడి పెరుగుచున్న పురాణ పురుషుని దేహము నందలి అణువులు, ఈ వేదఘోషల సంస్కార మున పవిత్రమై నిలచినవి. పరాశరుని యజ్ఞము నుండి పుట్టిన

వేదఘోషలు అంతవరకును యుగముల తరబడి ప్రసిద్ధి గాంచిన వేదఘోషలకన్నా భిన్నమై నిలచినవి. యజ్ఞము నుండి పుట్టిన వేదఘోషలు, సామలుగ ఆకాశ కక్ష్యలలో ప్రతిధ్వనించు నట్లేర్పడి నవి. అవియొక విధమగు వేణుగానమువలె వినిపించినవి. అట్టి వేదఘోషలతో కూడిన పంచభూతాత్మకమైన శరీరము పురాణ పురుషుని కేర్పరచిన పుణ్యము, పరాశరునితోపాటు మైత్రేయాదు లకు కూడ దక్కినది.

శ్రీకృష్ణుడు భారత యుద్ధానంతరము, రాబోవు కలియుగ మున జీవులుద్ధరింపబడుటకై యొక ప్రణాళికను రూపొం దించెను. ఆ ప్రణాళికననుసరించి వేదవ్యాసుడు దైవప్రేరితుడై భారత భాగవతాది గ్రంథముల నందించెను. అందు మహాభారత మున భగవద్గీతను కూడ నిక్షిప్తము గావించెను. అన్ని వేదములకు, ఉపనిషత్తులకు, శాస్త్రములకు, బ్రహ్మవిద్యకు, యోగశాస్త్రములకు సమన్వయాత్మకమగు పరిష్కారమే భగవద్గీత. అట్టి పరిపూర్ణమగు భగవత్ ఉపదేశమును వేదవ్యాసుడు దూరశ్రవణమున గ్రహించి, భారతమున నిక్షిప్తము చేసెను. వేదవ్యాసుడే లేనిచో కలియుగ మున ముందుచూపు వాఙ్మయమే కరువయ్యేడిది. అట్టి భక్తి, జ్ఞాన, వైరాగ్య యోగ సంభరితములైన వేదవ్యాసుని రచనలను మైత్రేయాదుల ద్వారా ప్రపంచమున శ్రీకృష్ణుడు ప్రకాశము గావించెను. కృష్ణుని దివ్య ప్రణాళికలో ప్రముఖమగు పాత్ర పోషించినది మైత్రేయుడు. మైత్రేయుని యందు శ్రీకృష్ణునికి గల ఆప్యాయత, అనుగ్రహము అద్వితీయము. రాబోవు కాలమున మైత్రేయుడే జీవులకు సన్మార్గము చూపగల జగద్గురువని శ్రీకృష్ణుని

భావన. శ్రీకృష్ణుడే త్రిలోకములకు గురువు, స్వామి అని మైత్రేయుని భావన. వారిరువురి సంభాషణములు అత్యంత రమణీయము. దైవము క్రీడను పరిపూర్ణముగ నంగీకరించుట, దానికై సంసిద్ధుడై యుండుట మైత్రేయుని ప్రత్యేకత. దైవము విషయమున మైత్రేయు డెప్పుడును అప్రమత్తుడే. కృష్ణుని నుండి మైత్రేయుడు, సాన్నిధ్యమును ప్రసాదించు మార్గము అతని అనుగ్రహముగ పొందినాడు.

శ్రీకృష్ణుడు కలిసంతారకమైన మార్గమునొకటి కల్పించెను. వేణునాదము మూలమున సాన్నిధ్యమునను గ్రహించుటకై సంకల్పము చేసెను. జీవుల హృదయములో మంద్రముగ సాన్నిధ్యము నిచ్చి మంద్ర చైతన్యరూపముననే జీవుల యందు విష్ణుత్వము నెరపుటకు సంకల్పించెను. హృదయములో వినిపించు వేణుగానమున కాకర్షితులై జీవులు మంద్రముగ చైతన్య మార్గమును పట్టుదురు. మంద్రజాలమున కాకర్షింపబడిన వారు యిక కలి సంకల్పించు యింద్రజాలమునకు లోనుగారు. కలి యింద్రజాలమునకు ప్రతిగ శ్రీకృష్ణుడు మంద్రజాలమును సృష్టించినాడు. నిర్విరామమైన మంద్రజాలమున ఒక్కొక్క జీవుని అనుగ్రహించుచు, వారిని చైతన్యమార్గమున ప్రవేశపెట్టుట కృష్ణుని సంకల్పము. ఇట్లు హృదయమునందు దివ్యస్పర్శనిచ్చి, జీవులను వెలుగు దారిన నడిపింపజేయుటలో జీవుడెన్ని జన్మలెత్తినను ఆపదలేదు. అతడు మరల జన్మించినపుడెల్ల హృదయమునందు నిక్షిప్తము గావింపబడిన మంద్ర చైతన్యము వికసించి వెలుగు దారులలోనే నడిపింపజేయును. ఈ మంద్రజాలము సాన్నిధ్యము కల్పించు మార్గము.

దీనిని జీవులకు అనుగ్రహించుటకు శ్రీకృష్ణుడు ఒక సిద్ధపురుషుని సూక్ష్మ శరీరమును వినియోగించుటకు సంకల్పించెను. చిరంజీవి, సిద్ధుడు, కలి ప్రయత్నించినను తాకలేని స్థిరచిత్తుడగు సిద్ధపురుషుని ఆవశ్యకత, శ్రీకృష్ణుడు గుర్తించి మైత్రేయమహర్షి నెన్నుకొనుట జరిగినది. అట్టి సిద్ధపురుషుడున్నచో తాను పాంచభౌతిక శరీరము ధరించవలసిన అవసరముండదు. సిద్ధ పురుషుని దేహము నుండియే తాను సమస్తమును నిర్వహించ వచ్చును. జీవులలోనికి వ్యాపనము చెందవచ్చును. విష్ణుత్వమనగా నిదియే. యిట్లు జీవులు విష్ణుత్వములోని కుద్ధరింపబడుచుండగ వారి విషయ మున కలి వివశుడగును. ఈ మార్గమునకు శ్రీకృష్ణుడు మైత్రేయ మహర్షిని ఎన్నుకొని, మరువు, దేవాపి మహర్షులను అతని అనుయాయులుగ ఒక త్రిభుజము నేర్పరచెను. ఈ త్రిభుజమే దివ్యప్రణాళికకు కలియుగమున పునాదిరాయి. దివ్య ప్రణాళిక యను మహాసౌధము ఈ ముగ్గురి మహర్షుల భుజస్కంధము లాధారముగ నిర్మింపబడుచున్నది.

పై విధముగ మైత్రేయుడు కలియుగమున జగద్గురువై వెలసెను.

నాటినుండి నేటివరకు తన అనుయాయులతో కూడి మైత్రేయ మహర్షి మంత్రజాలమార్గమున జీవుల నుద్ధరించుచునే యున్నాడు. కలి యుగాంతమువరకు అట్లు ఉద్ధరించుచునే యుండును. ఇది ఒక నిరుపమానమైన దీక్ష. మైత్రేయుడికి మైత్రేయుడే సాటి!

# మరువు, దేవాపి మహర్షులు

**మ**రువు, దేవాపి మహర్షులు అనాది నుండి భూమిజీవుల యుద్ధరణకై నిర్విరామము కృషిచేయుచున్న మహర్షులు. వీరి పుట్టు పూర్వోత్తరములు ఎవ్వరికిని తెలియదు. అన్ని పురాణము లందును వీరు గోచరింతురు. విష్ణుపురాణము నుండి భాగవత పురాణము వరకుగల పురాణములలో అచ్చటచ్చట ప్రస్తుతి చేయ బడిరి. జీవులకు వర్ణాశ్రమ ధర్మములను నేర్పుచు, ధర్మము నందు రుచి కల్పించి, ధర్మమార్గమున నడిపింపజేసి, ఉత్తీర్ణులను గావించుట వీరుచేయు మహత్తర నిష్కామ కర్మయజ్ఞము. ఈ యజ్ఞము వీరు అనాదికాలముగ నిర్వర్తించుచున్నారు. జగద్గురువు మైత్రేయునికి దివ్యప్రణాళికలో తోడ్పాటు గావించుచున్నప్పటికిని వీరు మైత్రేయునికన్న పూర్వులు. వాసుదేవుని వ్యూహమునందు జీవుల ఉద్ధరణకై యుగముల తరబడి పనిచేయుచున్న మహానుభావులు.

మరువు మహర్షి సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు వంశము వాడు. అనగా శ్రీరాముని వంశము వాడు. అనగా త్రేతాయుగము

నుండి భూమిపై నున్నవాడు. అంతకు ముందునుండి కూడ యుండి యుండవచ్చును. అట్లే దేవాపి మహర్షి చంద్రవంశపు రాజు. ఇతడు భీష్ముని తండ్రి అయిన శంతనమహారాజునకు అగ్రజుడు. ఆ జన్మలో దేవాపి బ్రాహ్మణ ధర్మమును స్వీకరించి తనకు తానుగ కోరి రాజ్యము నుండి బహిష్కరించబడెను. నిజము నకు కురు సామ్రాజ్యమునకు అతడు చక్రవర్తియై యుండ వలసినది. కాని వాసుదేవుని వ్యూహము ననుసరించి వాసుదేవుడు శ్రీకృష్ణుడుగ అవతరించుటకు ముందుగనే రాజ్యపరిత్యాగము గావించెను.

దేవాపి మహర్షి ఆ జన్మలో శ్రీకృష్ణుని కన్న నాలుగు వందల సంవత్సరముల ముందు పుట్టినవాడు! నాలుగు వందల సంవత్సర ముల ముందు దైవము యొక్క వ్యూహమును గ్రహించి, అందు తన పాత్రను గ్రహించి, తదనుగుణముగ చక్రవర్తిత్వమును పరి త్యాగము చేయుటకు కొంత దూరదృష్టి కావలెను. అది ఋషి దృష్టి. దేవాపి ఋషి మాత్రమే కాదు, రాజర్షి. రాజర్షి మాత్రమే కాదు మహర్షి. దేవాపి, శంతనుడు, కాశీరాజగు దివోదాసు, జగద్గురు వగు పరాశర మహర్షి, వీరందరును సమకాలికులు, వీరు ఆ జన్మల యందు, ఆయా దేహములందుండుట పురాణ పురుషుని అవతరణమునకు నాలుగు వందల సంవత్సరముల ముందు జరిగినది. దేవాపి మహర్షియై నిలుచుట ఆ జన్మలో జరిగినదను కొనలేము. అట్లే మరువు మహర్షి కూడా.

ఈ ఇరువురు మహర్షులు వాసుదేవుని వ్యూహమున అనాది కాలముగ పనిచేయుచు తెరవెనుక నుండుట కెక్కువ అభిలషించి

రని అనిపించును. మహర్షుల పుట్టు పూర్వోత్తరములు మనకు పురాణ సంహితలలో లభ్యమగును. వారు చేసిన సాధనలు కూడ లభ్యమగును. కాని ఈ మహర్షుల పుట్టు పూర్వోత్తరములు, సాధనలు పురాణముల యందు కూడ లిఖింపబడలేదు. అది బహుశః వారి సంకల్పము కావచ్చును. పరాశరులు విష్ణుపురాణమున, వేద వ్యాసులు భాగవత, కల్కి పురాణములలో వీరిని తగు మాత్రము పరిచయముచేసి వదలినారు. అదియును అతి స్వల్పమే.

ఈ భూమి పుట్టుక ముప్పదికోట్ల సంవత్సరముల క్రితము జరిగినది. అందు ఆది మానవుని అవతరణము ఒకకోటి, ఎనభై లక్షల సంవత్సరముల క్రితము జరిగినది. ఈ కోటి ఎనభై లక్షల సంవత్సరములలో కొన్ని మన్వంతరములు గడచినవి. ఎన్నియో యుగములు గడచినవి. మానవజాతి ఉద్ధరణమునకై కుమారులు, ఋషులెందరో భూమికి దిగి వచ్చిరి. ఈ మొత్తము భూమి కథ, మానవజాతుల కథ, ఈ మహర్షు లిద్దరికిని కరతలామలకములు. ఈ భూమిపై జరుగుచున్న జగన్నాటకమునంతయు వారు సాక్షీ భూతులుగ గమనించుచు తమ వంతు కర్తవ్యమును వాసుదేవుని కల్పితముగ నిర్వర్తించుచున్నారు. వీరిరువురును దివ్యదేహ ధారులు. అణువుల నుండి అప్పటికప్పుడు దేహమును కట్టుకొని ప్రత్యక్షము కాగలరు. అట్లే అదృశ్యము కాగలరు. స్మరణ మాత్ర మున సాన్నిధ్యమునివ్వగల వాసుదేవోపాసకులు. వీరు విష్ణు స్వరూపులు, త్రికాలజ్ఞులు వీరికి తెలియని మన్వంతర రహస్య ములు, మతాతీత సత్యములు, మానవజాతి కథలు, లేవన్నచో అతిశయోక్తి కాదు.

రాశిచక్రమున సద్గురుపరంపర అంతయు ఆషాఢ శ్రావణ ములను అధిష్ఠించి యుండగ మరువు మహర్షి మేషరాశిని, దేవాపి మహర్షి ధనుర్ రాశిని అధిష్ఠించి యున్నారు. ధనుర్రాశి మూలాధార ప్రజ్ఞ. అచటనే యోగప్రజ్ఞ యున్నది. ఈ కేంద్రమునకు దత్తా త్రేయుడధిపతి. కపిలుడు గణపతి, హనుమంతుడు అచ్చటి గురుపరంపర. ఇట్టి మహత్తరమైనటువంటి యోగప్రజ్ఞకు అధిపతిగ ధనుర్ రాశిని పరిపాలించుచున్న దేవాపి మహర్షి, సమస్త యోగ మార్గములను ప్రచోదనము గావించుచు జీవులను త్వరితగతిని పురోగమింపచేయుచున్నారు. యోగమునకు మూలాధారము ఆరంభముకాగ సహస్రారము గమ్యమై యున్నది. అచ్చట ఆ ప్రజ్ఞను పరిపాలించుచు మరువుమహర్షి జీవుల నూర్ధ్వముఖమున కాకర్షించుచుండును. ఉత్తమలోకముల ప్రవేశము కల్పించు చుండును. యోగదండము లేక బ్రహ్మదండమునకు ఇరుపార్శ్వ ముల వీరిరువురు పనిచేయుచు భూమి యందలి సమస్త గురు పరంపరకు స్ఫూర్తినిచ్చుచు మరుగుననున్నారు.

రహస్య దివ్యాచరణము వీరిరువురి ప్రత్యేకత. రహస్యము, మౌనము, అనిర్వచనీయమగు పవిత్రత, ఆత్మత్యాగము వీరి సహజ లక్షణములు. తమకు పేరు ప్రతిష్టలు కలుగకుండ దైవమునకే పేరు ప్రతిష్ఠలు కలుగునట్లు ప్రవర్తించు దివ్యజీవులు, చిరంజీవులు.

చిరంజీవులు లోక కళ్యాణార్థమై భగవత్ వ్యూహము ననుస రించి జన్మలెత్తుచు తామెవరో తమకు జ్ఞప్తి కలిగి వర్తింతురు. జన్మ ప్రయోజనములను మరువక, లోక హితార్థమగు కార్యముల

నొనర్చుచు మనస్సు, ఇంద్రియము, శరీరములను హితకార్యముల కొరకై ఉపకరణములుగ వాడుదురు. చచ్చిన వెంటనే మనుష్యు డంతరించునని, శరీరముకన్న వేరుగ జీవుడు లేడని మ్లేచ్ఛ సిద్ధాంతము. ఇట్టివారు తమ శరీరమే తామనుకొని జీవించు చుందురు. కాని శరీరములంతములైనపుడు జీవులా శరీరములతో మరణింపరన్నది శాశ్వత సత్యము. శరీరము మరణించినప్పుడు జీవుడు మరియొక శరీరమును కోరును. నూతన శరీరము కర్మాను బంధమై ఏర్పడును. నూతన శరీరమున జన్మించినపుడు మునుపటి జీవితము మరుపునకు వచ్చును. నిజమునకు మరుపే మృత్యువు. మరుపు లేనివానికి మృత్యువు లేదు. మృత్యువనగా మరుపేకాని, శరీరమంతమగుట కాదని పెద్దల యవగాహన. జన్మల తరబడి తామెవరో, తమ కర్తవ్యమేమో జ్ఞప్తి యున్న వారిని చిరంజీవు లందురు. వీరు మరపులేని వారు గనుక మృత్యువును దాటిన వారు. వీరికనేక జన్మలలో ఒకే స్మృతి అనుస్యూతముగ నుండును. ఒకే పవిత్రమైన కార్యము ఇన్ని జన్మల తరబడి నిర్వహించుటలో వారు నిమగ్నులైయుందురు.

ఇట్టి చిరంజీవులను గూర్చి వేద పురాణాది సంహితలలో ఉదహరించినపుడు ఏ జన్మలోని శరీర నామముతో చెప్పవలెను? జన్మమున కొకపేరు తల్లితండ్రుల ద్వారా ఏర్పడుచుండును. ఆ పేరు ఆ జన్మాంతము వరకే. మరల జన్మ ఎత్తినపుడు మరియొక పేరు యేర్పడుచుండును. దుస్తులు మారినట్లు జన్మములు మారు చుండగ, ఇన్ని దుస్తుల యందు ఒకే మనిషిని ఒకే నామముతో

పిలుతుము గదా! అట్లే సూక్ష్మ లోకములలో శరీరములు మారి నప్పటికిని నామము ఒక్కటియే యుండును. చిరంజీవుల కిట్టి నామముండును. వారిని గూర్చి ప్రస్తావించినప్పుడు వారి మొత్తము వృత్తాంతమునకును, జన్మలన్నింటికిని సూచకమగు సంకేతనామ మొకటి యుండుట సదుపాయము. ఇది వేదసంప్రదాయము. వేద పురాణములయందు గోచరించు ఋషుల పేర్లలో ఎక్కువ భాగమిట్టిదే. ఈ విధముగ దేవాపి, మరువు మహర్షులు, వేద వ్యాసుని పురాణములయందు పేర్కొనబడిరి. అంతకు ముందు పరాశరులున్నప్పటి దేవాపి, మరువు మహర్షుల శరీరములు వేరు. వేదవ్యాసులకు సమకాలికులుగ, మైత్రేయునికి ప్రాణమిత్రునిగ నున్న ఈ ఋషుల దేహములు వేరు.

ఈ మహర్షులు మూడు రకముల దేహములు కలిగి మూడు విధములగు కార్యములను ఒకేమారు నిర్వర్తింపగలరు. వీరికి వజ్ర శరీరముండును. ఇది దాదాపు శాశ్వత శరీరమే. దీనిని కారణ శరీరమని కూడ అందురు. ఇందుండి వెలుగు లోకముల కార్యము లను చక్కపెట్టుదురు. సూక్ష్మతరమగు దివ్య ప్రణాళికను గ్రహింతురు. తదనుగుణముగ కర్మాచరణమేర్పరచుకొందురు. వీరికి సూక్ష్మ శరీరముకూడ నొకటి యుండును. ఇందుండి సూక్ష్మ శరీర కార్యములు చక్కబెడదురు. భౌతిక శరీరమొకటి యుండును. ఇందుండి భూలోక కార్యములను చక్కబెడుదురు. అవసరమగుచో ఒకే సమయమున పలుచోట్ల కనిపింపగలరు. ఈ శరీరము లన్నియు అష్టాంగ యోగమున మానవునికి సిద్ధించగలవు. ఇవి అద్భుత

ములు కావు. కృషి ఫలములు. జన్మల తరబడి చేసిన నిష్ఠాయుత మైన యోగసాధన యోగసిద్ధినిచ్చును. ఈ విషయమున మహర్షులు పరిపూర్ణసిద్ధులు.

ఉదాహరణకు మరువు, దేవాపి మహర్షులు హిమాలయ ములలోని కలాప గుహల యందు నివసించుచు భౌగోళికముగ లోకహితులకు, సత్సాధకులకు ప్రేరణ కలిగించుచు జాతి పురోగ మునకై అహర్నిశలు పనిచేయుచుందురు. వీరు శ్రీకృష్ణుని ద్వారకా జీవన సమయమున కృష్ణునికి తోడ్పాటు గావించుచు అనేకానేక కార్యములను ద్వారకలో చక్కపెట్టుచుండెడివారు. అచ్చట వారి పేర్లు శతానీకుడు (దేవాపి), మధువ్రతుడు (మరువు).

అధర్మమెప్పుడును ధర్మముపై దురాక్రమణము చేయుచు నుండును. దీనికి అమాయక ప్రజలు బలియగుచుందురు. ఇట్టి ప్రజలను కాపాడుకొనుట, ధర్మమును నిలబెట్టుట, ప్రకృతి యొనర్చునొక కర్తవ్యము. యిట్టి పరమ ప్రయోజనమును సాధించు టకు ప్రకృతియే కొందరు జీవులను, సిద్ధులుగను, చిరంజీవులు గను తీర్చిదిద్దుకొనుచుండును. నిజమునకు యీ ఋషులు శ్రీకృష్ణుని అప్రాకృత శరీర నిర్మాణ మహాయజ్ఞమున కూడ పాల్గొని నారు. పరాశరులు, మైత్రేయులు, వేదవ్యాసులతో కలసి తమ వంతు కర్తవ్యములెన్నియో వినియోగించినారు. రహస్య జీవన మున కిచ్చగించుటచే పురాణ సంహితలలో తమను గూర్చిన ప్రస్తావన బీజప్రాయముగనుండునట్లు జాగ్రత్త పడినారు. మైత్రేయుడు, వేదవ్యాసులు ఎంతటి ప్రసిద్ధిగాంచిన యోగులో

వీరుకూడ నట్టి వారే. ఆరాధ్యనీయులే. ప్రాతఃస్మరణీయులు, వాసుదేవ స్వరూపులు.

భాగవతమున వేదవ్యాస మహర్షి ద్వాదశ స్కంధమున వీరిని గూర్చి ఇట్లు పలికెను. “శంతనుని యనుజుండగు దేవాపియు, ఇక్ష్వాకు వంశజుండగు మరుత్తును, యోగయుక్తులై కలాప గ్రామ నిలయులై కలియుగాంతమువరకు వాసుదేవ ప్రేరితులై ప్రజలను ఆశ్రమాచార ధర్మములు తప్పకుండ నడుపుచు నారాయణ స్మరణంబు నిత్యం బొనర్చి కైవల్యపద ప్రాప్తులగుదురు.”

అట్లే నవమ స్కంధమున దేవాపి, మరువు మహర్షులీ విధముగ తెలుపబడిరి.

శ్రీఘ్రునకు మరువు అను రాజశ్రేష్టుండు పుట్టెను. ఆ రాజ యోగి సిద్ధుడై కలాప గ్రామంబుననున్నవాడు. కలియుగాంతంబున నష్టంబయ్యెడు సూర్యవంశంబు గ్రమ్మర బుట్టింప గలవాడు. (12వ ఆధ్యాయము)

*దేవాపి కలాప పురం*
*బావాసము కాగ యోగియై యున్నాడు*
*ర్వీవర కలి నష్టంబగు*
*జైవాతృక కులము మీద సంస్థాపించున్*

విష్ణు పురాణమున వీరిని గూర్చి పరాశర మహర్షి యిట్లు పలికెను :

*దేవాపి : పౌరవో రాజా మరుశ్చిశ్వాకు వంశజ మహాయోగ*

*బలౌపేతౌ, కలాపగ్రామ సంశయో కృతేయుగ ఇహాగత్వ ఛత్ర ప్రవర్తకే హితౌ భవిష్యతో మనోర్వేశే బీజ భూతౌ వ్యవస్థితౌ యేతేన క్రమయోగేన మనుపుత్రే వసుంధర కృత త్రేతాది సంజ్ఞాని యుగాని త్రీర్యుగ భుజ్యతే కలౌతు బీజ భూతాస్తే కేచి త్తిష్టంతి భూతలే. యద్వైవ దేవాపి మరువు సంప్రాప్తం సమవిస్తతే.*

కురువంశపు రాజగు దేవాపి, ఇక్ష్వాకు వంశపు రాజగు మరువు సమస్త యోగ సిద్ధులు కలిగి కలాప గ్రామమున నివసించు చున్నారు. కృతయుగము వచ్చు వరకు వారు జీవులచే హితము ననుసరింప చేయుచు మరల వర్ణాశ్రమ ధర్మములను భూమిపై స్థాపింపగలరు. వారు రాబోవు మన్వంతరమునకు బీజములై నిలచుటకు సంకల్పించినారు. భవిష్యత్ యుగములలో (కృత, త్రేత, ద్వాపరములలో వారు జీవులకు యోగము, ధర్మముల నందింపజేయుదురు.)

కల్కి పురాణమున కూడ నిదే విషయమును వేదవ్యాస మహర్షి పేర్కొనుట జరిగినది. అందిట్లున్నది : *మరుపు దేవాపి మహర్షులు యోగేశ్వరులై ఋషి నివాసమైన కలాప గ్రామమున వసించి యున్నారు. కలియుగాంతమున వీరు మరల వర్ణాశ్రమ ధర్మములను మానవుల కందించి నూతన శకము ఆరంభింతురు. (9వ స్కంధము, 22వ అధ్యాయము)*

కల్కిపురాణమున రెండవ అధ్యాయమున ప్రథమ అంశ మున శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునితో పలికిన పలుకులుగ యిట్లు లిఖించబడినది : నీ ప్రార్థన ననుసరించి నేను భవిష్యత్తున శంబళ

గ్రామమున విష్ణు యశస్సు, సుమతి దంపతికి  జన్మించ గలను. నా నలుగురు సోదరులతో నేను మరల అజ్ఞానమును, అధర్మ మును ఛేదించి, ధర్మమును స్థాపించగలవాడను. నీవును దేవతలు మీ మీ అంశలలో జన్మించి నాకు తోడ్పాటు గావించగలరు. నా హృదయేశ్వరియగు శ్రీలక్ష్మి సింహళరాజగు 'బృహధృతుడు, కౌముదులకు పద్మ అను నామమున జన్మించగలదు. అపుడు నేను భూవలయమునకు మరువును చక్రవర్తిగను, దేవాపిని జగద్గురువుగను స్థాపింతును. అప్పటినుండి భూమిపై సత్య యుగ మారంభమగును. శాశ్వత ధర్మము నెలకొల్పబడును. కలి వధింప బడును.

కల్కి పురాణమున యింకను యిట్లున్నది : మునుల ప్రార్థనల నంగీకరించి కల్కి భగవానుడు గంగాతీరమున వారికి ప్రత్యక్షమై మునులనందరిని పలుకరించి ఆశీర్వదించి యిట్లనెను. "పుణ్య పురుషులారా! మీ యందు దేదీప్యమైన కాంతులతో వెలుగొందుచున్న ఆ యిరువురి మహాత్ములెవరు? వారిచ్చటి కెందులకేతెంచిరి? వారు గంగకు ఎందుకు ప్రార్థనలు సలుపు చున్నారు?" అనుచూ యింకను వారిరువురిని ఉద్దేశించి యిట్లనెను. "మీరు జాహ్నవి నెందుకు ఆరాధించుచున్నారు? మీరెవరు? మీ నామములేవి?

అపుడు మరువు మహర్షి ముందుకేతెంచి, కల్కి దేవునికి నమస్కరించి తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు, తన నామమును తెలిపెను. చతుర్ముఖ బ్రహ్మ నుండి మరీచి పుట్టుట,

మరీచి నుండి మరువు పుట్టుట, మరువు నుండి ఇక్ష్వాకు పుట్టుట అట్లు వరుసగ వంశపరంపరను విశదీకరించి తాను యిక్ష్వాకు వంశజుడనని, శీఘ్రుని కుమారుడనని వివరించెను. మరువు ఇంకను యిట్లనెను.

కృత యుగాంతమునుండి ఈ కలియుగాంతము వరకు కలాప గ్రామము నివాసిగ తాను ధ్యాన నిమగ్నుడై లోకహితమున నిలచి వాసుదేవ ప్రేరితముగ నిలచియున్నానని తెలిపెను. మరువు మహర్షి బ్రహ్మనుండి జనించిన వంశమునందు తాను యాభై తొమ్మిదవ వానిగ తెలుపుకొనెను. అప్పుడు కల్కి దేవుడు కోరగ దేవాపి మహర్షి కూడ తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు చంద్రవంశమును వర్ణించెను. అత్రి మొదల్కొని, ప్రతీకుని వరకు గల చంద్రవంశమును తెలిపి, తాను ఆ వంశమున నలుబది రెండవ తరమునకు చెందినవాడని, తన నామము దేవాపి యని తెలిపెను. తాను కూడ మరువు మహర్షివలె కలాప నివాసియై, ధ్యానయోగమున నిలచి వాసుదేవప్రేరితముగ లోకహితముగ కార్యముల నొనర్చితినని తెలిపి నమస్కరించెను.

అపుడు కల్కిదేవుడు సంతసించి వారిరువురి నాశీర్వదించి యిట్లు పలికెను :

"మీరిరువురు అసమాన ధర్మస్వరూపులు. వాసుదేవుని వ్యూహము ననుసరించి జగత్‌హితముగ యుగముల తరబడి మానవజాతి ఉద్ధరణకై కృషి సలిపినారు. నేను కలి ధర్మమును నశింపచేసి కృత ధనువును స్థాపించగలవాడను. అపుడు మరువు

భూవలయమునకు చక్రవర్తియై అయోధ్య రాజధానిగ ధర్మ పరిపాలనమును ప్రారంభింప గలడు. దేవాపి జగద్గురువై హస్తిన కేంద్రముగ విశ్వ విజ్ఞాన విద్యను, వేద వేదాంగములను, యోగ మును జీవుల కందించుచు వారిని అమృతత్త్వదిశగ నడుపగలడు.

ఇట్లనేకానేక విషయములు కల్కిపురాణమున ఈ మహర్షుల గురించి వివరింపబడినవి.

ఇట్లు మరువు, దేవాపి మహర్షులు కలాపగుహల యందు నివసించుచు మైత్రేయునితో సహకరించుచు విశ్వవిజ్ఞాన విద్యయు, యోగమును భూగోళ వ్యాప్తి గావించుచు తదను గుణ మైన శిష్యపరంపరను నేర్పరచుచు సాగుచున్నారు.

వీరి ప్రభావముననే గ్రీకు, ఇజ్రయిలు దేశములలో విశ్వ విజ్ఞానవిద్య ఆయా శతాబ్దములలో వెలుగొందినవి పైథాగరస్. సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ మొదలగు జ్ఞానులు గ్రీకు దేశమున కెంతయో జ్ఞానము నందించిరి. గ్రీకు దేశపు జ్ఞానులలో పైథాగరస్ అత్యంత ప్రసిద్ధి గాంచినాడు. దేవాపి మహర్షియే పైథాగరస్‌గ జన్మించి గ్రీకు దేశీయులకు జ్ఞానభిక్ష పెట్టెనని యొక నానుడి కలదు.

అటులనే రోమనుల యందు పుట్టిన చక్రవర్తులందరికిని సూర్యవంశపు రాజైన మరువు ప్రచోదన కారకుడని కూడ యొక నానుడి కలదు. రోమను సామ్రాజ్యమున ఘనకీర్తి సంతరించు కొన్నవాడు జూలియస్‌సీజర్. అతడు మరువు మహర్షి యొక్క ప్రధాన శిష్యుడని యొక నానుడి కలదు. రోమను రాజ్యమే లేనిచో

ఐరోపా ఖండమునకు నాగరికతయే యుండెడిది కాదు. సంఘ జీవనము, నగరవాసము, పౌర బాధ్యతలు, రాజ్యాంగము, చట్టము పరిరక్షణ, ఖగోళ భూగోళ శాస్త్రములు, జ్యోతిష్యము, ఇత్యాది మానవ వికాసపరమగు అంశములన్నియు రోమనులే ఐరోపా ఖండమున ప్రవేశపెట్టిరి. అంతకుముందు శతాబ్దముననే ఆర్యా వర్తపు ప్రజలు నాగరికులై యుండెడివారు. హస్తిన, ద్వారక, వారణాసి, మధుర, ఉజ్జయిని విశిష్ట నగరములుగ నుండెడివి.

యూదు ప్రజలను బానిసత్వము నుండి విడిపించిన మోజెస్, మరువు మహర్షి అవతారమని, అతి బలిష్టమైన ఈజిప్టు చక్రవర్తిని నిర్జించి, బానిసత్వపుచెర నుండి విడిపించి యూదు లకు స్వాతంత్ర్యము కల్పించుటయే కాక, వారికి జ్ఞానభిక్షను కూడ పెట్టినాడు. అటులనే యూదు ప్రవక్తలలో అత్యంత ప్రాధాన్యము వహించిన జ్ఞాని 'యలీజా' దేవాపి మహర్షి యొక్క అవతారమని కొందరు భావించుచుందురు.

ఏసుక్రీస్తు జన్మ సమయమున అతనిని సందర్శించి ఆశీర్వ దించిన ముగ్గురు జ్ఞానులును మైత్రేయుడు, మరువు, దేవాపి మహర్షులని హిమాలయములలోని ఆశ్రమవాసులు భావింతురు. చివరి మూడు సంవత్సరములు ఏసును నడిపించినది కూడ మైత్రేయుడే అని వారి భావన.

ఇటీవల శతాబ్దములలో నెపోలియన్ చక్రవర్తికి ప్రేరణ కలిగించి ఐరోపా ఖండమంతటికిని ఒకే రాజ్యాంగ విధానము

నందింపజేసిన బృహత్తర ప్రయత్నము వెనుక మరువు మహర్షి హస్తమున్నదని ప్రతీతి.

పంతొమ్మిదవ శతాబ్దములో ఈ మహర్షులే హెలేనా పెట్రోవా బ్లావెట్స్కీకి దర్శన మిచ్చి జ్ఞానబోధను గావించి, పిండాండ బ్రహ్మాండ సృష్టి రహస్యములును, మన్వంతర రహస్యములను తెలియజెప్పి, విశ్వ విజ్ఞాన విద్యకు మరియొక ప్రయత్నము చేసినారు. ఆ ప్రయత్నమునకు కొనసాగింపుగ 20వ శతాబ్దమున 'ఏలిస్. ఏ. బైలీ' అను ఆంగ్లయువతిని, 'నికోలారోరిక్' అను రష్యా దేశపు యువ రాజును, భారతీయులైన 'కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యుల' వారిని తమ స్పర్శచే ప్రభావితము గావించి భౌగోళిక జ్ఞానసంపదను సంతర్పణ గావించినారు.

భౌగోళికముగ ఐదువేల సంవత్సరములలో ఈ మహర్షులు గావించిన మహత్తర కార్యములన్నియు కూడ మానవ పురోభివృద్ధికే నిర్దేశింపబడినవి. జీవ పరిణామమునకే తోడ్పడినవి. గత ఐదువేల సంవత్సరములుగ వీరు తీర్చిదిద్దిన శిష్యపరంపర భౌగోళిక వ్యాప్తి చెందినవి. అన్ని రంగములలోను నిష్ణాతులైన శిష్యులు కలరు. అమెరికన్ ప్రెసిడెంట్ 'రూజ్‌వెల్ట్', శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' వంటి మహాపురుషులు కూడ వీరి శిష్యకోటిలోని వారే. మతముల కతీతమైన సత్యములను దర్శింపచేయుచు మత ఛాందసము నుండి జీవుల నుద్ధరించుట కూడ వీరు చేయు ప్రయత్నములోని భాగములు. అట్టివారిలో భరత దేశము నేలిన అక్బరు చక్రవర్తి యొకరు. ఆయన దేవాపిమహర్షి శిష్యుడని ప్రతీతి.

ఋషి కార్యముల నెరుగుట ఋషుల అనుగ్రహముననే తెలియగలదు. అంతయును తెలుపుట ఎటులను సాధ్యము కాదు. కాని వారి స్మరణ సకల శుభంకరము. అట్టి ప్రయత్నమే ఇది. మరువు, దేవాపి మహర్షుల గూర్చి పురాణ సంహితల యందున్నను తెలిసిన వారు బహుకొద్ది. గుప్తముగ వేల సంవత్సరముల నుండి జగద్ధిత కార్యముల నొనర్చుచున్న ఈ మహర్షులను గూర్చిన విషయములు ఇప్పుడిప్పుడే జనసముదాయము పరిచయము లోనికి వచ్చుచున్నవి. వారిని గూర్చి పరిచయము చేయు ప్రయత్నమే ఇది.

# OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

***The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.***


| | | |
|---|---|---|
| 1. | Agni | E/G/S |
| 2. | Amanaskudu | T/K |
| 3. | Antardarsana Dhyanamulu | T/K |
| 4. | Anveshakudu | T |
| 5. | Asangudu | T |
| 6. | Ashram | E/S/G |
| 7. | Ashram Leaves | E/G/S |
| 8. | Ayurvedic Principles | E |
| 9. | Bharateeya Sampradayamu | T/Hi/K |
| 10. | Bhrikta Rahita Taraka Rajayogamu | T/K |
| 11. | Cow (‘Govu’ Mahatyam Vivarana) | E/S/K |
| 12 | Cow (‘Govu’ Mahatyam Vivarana) | H/T |
| 13. | Devapi Maharshi Bodhalu | T/Hi/K |
| 14. | Dhanakamuni Katha | T |
| 15. | Doctorine of Eternal Presence | E/S |
| 16. | Gayatri Mantra - Avagahana | T |
| 17. | Geetopanishad - Gnana Yogamu | T |
| 18. | Geetopanishad - Karma Yogamu | T |
| 19. | Geetopanishad - Sankhya Yogamu | T |
| 20. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 21. | Geetopanishad - Karmasanyasa Yogamu | T |
| 22. | Good Friday | E/G/S/F/H |
| 23. | Health & Harmony | E/G |
| 24. | Healer's Hand Book | E |
| 25. | Hercules-The Man and the Symbol | E/G/S |
| 26. | Himalaya Guru Parampara | T/Hi/K |
| 27. | Jupiter-The Path of Expansion | E/G/S |
| 28. | Just Adjust | E/G/S/F |
| 29. | Jyotirlinga Yatra | T |
| 30. | Katha Deepika | T |
| 31. | Kapila & Kardama | E/G/S |
| 32. | Listening to Invisible Master | E/G/S/F/H |
| 33. | Lord Maitreya-The World Teacher | E/G/S/F |
| 34. | Lectures on Secreat Doctrine-I | E |


| | | |
|---|---|---|
| 35. | Lectures on Secreat Doctrine-II | E |
| 36. | Lectures on Secreat Doctrine-III | E |
| 37. | Maitreya Maharshi Bodhalu | T/Hi |
| 38. | Mana Mastaru Garu | T |
| 39. | Mantrams-Their Significance and Practice | E/G/S |
| 40. | Maria Magdalena | E/S |
| 41. | Marriage-Subline Sacrament | E/G/S |
| 42. | Mars (The Kumara) | E/G/S |
| 43. | Maruvu Maharshi Bodhalu | T/Hi/K |
| 44. | Master C.V.V. (Birthday Message) | T/K |
| 45. | Master C.V.V. Noothana Yogamu | T/K |
| 46. | Master C.V.V. Yogamu | T/K |
| 47. | Master C.V.V. Yogamu-Karma Rahityamu | T/K |
| 48. | Master C.V.V. - May Call - I | E/G/S |
| 49. | Master C.V.V. - May Call - II | E |
| 50. | Master C.V.V. - Saturn Regulations | E/G |
| 51. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror | E |
| 52. | Master E.K. - The New Age Teacher | E/G/S/T |
| 53. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 54. | Mercury - The Alchemist | E/G/S |
| 55. | Mithila-A New Age Syllabus | E/G/S/K |
| 56. | New Age Hospital Management | E/G/S/F |
| 57. | Occult Meditations | E/G/S |
| 58. | Om Namo Narayanaya | E |
| 59. | Omkaram | T/K |
| 60. | On Change | E/G/S |
| 61. | On Healing | E/G/S |
| 62. | On Love | E/G/S |
| 63. | On Service | E/G/S |
| 64. | On Silence | E/G/S |
| 65. | Our Teacher and His Works | E/G/S |
| 66. | Parikshit - The World Disciple | E/G/S/F |
| 67. | Pranayamam | T/K |
| 68. | Prayers | E/G/S |
| 69. | Rudra | E/G/S |
| 70. | Sai Suktulu / Sai ki Amruthavani | T/H |
| 71. | Sadhana Panchakam | T |
| 72. | Sanghaneeti | T |
| 73. | Teachings of Kapila | E/G |
| 74. | Saraswathi - The Word | E/G/S |
| 75. | Saturn-The Path of Systematised Growth | E/G/S |

| | | |
|---|---|---|
| 76. | Shodasopachara Pooja - Avagahana | T |
| 77. | Sound-The Key and its Application | E/G/S |
| 78. | Spiritualism - Business and Management | E/G/S |
| 79. | Spiritual Fusion of East and West | E |
| 80. | Sun - That I am | E/G/S |
| 81. | Sri Dattatreya | G/S/H/T/E |
| 82. | Sri Gurupaduka Sthavam | T/K |
| 83. | Sri Krishna Namamrutham | T |
| 84. | Sri Lalitha (Set-10 parts) | T |
| 85. | Sri Sastri Garu | T/E/G/S/F |
| 86. | Sri Shiridi Sai Sayings | E/G/S |
| 87. | Steps of Silence | E |
| 88. | The Aquarian Cross | E/G/S |
| 89. | The Aquarian Master | E/G/S |
| 90. | The Doctorine of Ethics | E/S |
| 91. | The Etheric Body | E/G/S |
| 92. | The Golden Stairs | E/S |
| 93. | The Healer's of Hand Book | E |
| 94. | The Path of Synthesis | E/S |
| 95. | The Splendor of Seven Hills | E/T/Hi/S/K |
| 96. | The Teacher - Meaning & Significance | E/G/S |
| 97. | The Teachigs of Lord Sanatkumara | E/G/S |
| 98. | The Teachings of Kapila | E |
| 99. | The Theosophical Movement | E/G/S |
| 100. | The White Lotus | E/G/S/K |
| 101. | Time - *The Key* | E/G/S |
| 102. | Uranus - The Alchemist of the Age | E/G/S |
| 103. | Varunagraha Prabhavamu | T/K |
| 104. | Venus - The Path of Immortality | E/G/S |
| 105. | Violet Flame Invocations | E/G/S |
| 106. | Vrutrasura Rahasyam | T |
| 107. | Wisdom Buds | E/S |
| 108. | Wisdom Teachings of Vidura | E/G/S |

Please visit our website
(www.dhanishta.org / info@dhanishta.org)
for prices
Phone : 0891- 2701531, 2509154

## ధనిష్ఠ ప్రచురణలు







ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531

www.dhanishta.org info@dhanishta.org

పరమగురువుల పరంపర ముక్తజీవుల సంఘము. వారు భూమిజీవుల శ్రేయస్సు కొరకు, మరియు భూమి శ్రేయస్సు కొరకు పనిచేయుచుందురు. జీవులకు విశ్వచైతన్యమును గుర్తుచేయుట, మరియు ప్రతిజీవియు చైతన్యము యొక్క రూపమేనని తెలియజేయుట ప్రధాన అంశముగా వారు నిర్వర్తింతురు. వారి అనుయాయులు భూమి నాలుగుచెఱగుల, హిమాలయములు కేంద్రముగా పనిచేయుచుందురు. మానవజాతి శ్రేయస్సుకై పనిచేయు మానవతావాదుల ఆలోచనాశక్తి నుండి కూడా వ్యక్తమగుట వారు చేయు ముఖ్యమైన కార్యక్రమము. జీవుల శ్రేయస్సుకై వివిధములుగ కృషి చేయుచున్న వారందరూ మానవతావాదులే.

9 788189 467425

Sathyam 984 999 6538